సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 23 । జూలై । 2023

న్యూస్‌రీల్

జిల్లాకు 3,170 ఈవీఎంలు



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) చేరుకున్నాయి. పార్వతీపురంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని ప్రత్యేక భవనంలో ఈవీఎంలను శనివారం భద్రపరిచారు. ఎన్నికల సంఘం 3,170 కొత్త బెల్‌ఎం-3 ఈవీఎంలు, వీవీపీఏటీఎస్‌ను కేటాయించింది. విశాఖపట్నం నుంచి 3,600 బ్యాలెట్ యూనిట్లు (బీయూ), 1500 కంట్రోల్ యూనిట్లు (సీయూ), కాకినాడ నుంచి 1250 సీయూలు కేటాయించింది. కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఆర్వో జె.వెంకటరావు ఆధ్వర్యంలో ఈవీఎంలు భద్రపరించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంపై చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

పాచిపెంట: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, పద్మాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలను డీఈఓ ప్రేమ్‌కుమార్ శనివారం పరిశీలించారు. పాఠశాలల్లో రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేశారు. మరో ఏడుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు.

బలిజిపేటవైపు ఏనుగులు



కొరటాం నుంచి బలిజిపేట మండలం వైపు వెళ్తున్న ఏనుగుల గుంపు

తెర్లాం: ఏనుగుల గుంపు కొల్లివలస, వంతరాం మీదుగా బలిజిపేట మండలం పలగర వైపు శనివారం వెళ్లాయి. మండలంలోని కొరటాం, రంగప్పవలస, తమ్మయ్యవలస తదితర గ్రామాల్లో ఐదు రోజులపాటు సంచరించి ప్రజల, రైతులను భయాందోళనకు గురిచేసిన ఏనుగుల గుంపు తెర్లాం మండలాన్ని వదిలి వెళ్లిపోయాయన్న వార్తతో ఊపిరి పీల్చుకున్నారు.

పుష్కలంగా సాగునీరు



ఎడమకాలువలో 7వ బ్రాంచ్ వద్ద నమోదైన 3 అడుగుల నీటిమట్టం

వీరఘట్టం: ఈ ఏడాది తోటపల్లి పాత ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించడమే తన లక్ష్యమని జలవనరులశాఖ డీఈఈ దమలపాటి రవికుమార్ తెలిపారు. ఈ నెల 20న తోటపల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు విడుదల చేసిన నీటి సరఫరా తీరును శనివారం పరిశీలించారు. ప్రస్తుతం ఎడమకాలువకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తెలిపారు. ఎడమకాలువలో 7వ బ్రాంచ్ వద్ద మూడు అడుగుల నీటి మట్టం ఉందన్నారు. పాలకొండ శివారు ప్రాంతానికి ఆదివారం ఉదయానికి సాగునీరు చేరుతుందన్నారు. సాగునీటిని సద్వినియోగం చేసుకుని ఉభాలు పూర్తిచేసుకోవాలని రైతులను కోరారు.

సకాలంలో పుస్తకాలు



బలిజిపేట మండలంలో పుస్తకాలు పంపిణీచేస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

- 1584 ప్రభుత్వ పాఠశాలల్లో సాగుతున్న పుస్తకాల పంపిణీ
- ఇప్పటికే 78,559 మందికి పుస్తకాలు అందజేత
- మిగిలిన 16,165 మందికి సోమవారం పంపిణీ

పార్వతీపురంటౌన్: ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. పేదకుటుంబాల పిల్లలు ఆర్థిక సమస్యలతో చదువుకు దూరంకాకూడదన్న ఉద్దేశంతో వివిధ పథకాల కింద సాయం అందజేస్తోంది. పుస్తకాలను సకాలంలో పాఠశాలలకు చేర్చుతూ విద్యాభ్యసనకు సహకారం అందిస్తోంది. అందులో భాగంగానే పార్వతీపురం మన్యం జిల్లాలో పుస్తకాల పంపిణీ వారం రోజులుగా జోరుగా సాగుతోంది. పాఠశాలల ప్రారంభం రోజునే జగనన్నవిద్యాకానుకల్లో భాగంగా తొలిసెమిస్టర్ పుస్తకాలను ప్రభుత్వం అందజేసింది. తాజాగా, అక్టోబర్‌లో అభ్యసించే రెండో సెమిస్టర్ పుస్తకాలను ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ముందుగానే సమకూర్చింది. పుస్తకాల పంపిణీలో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములవుతున్నారు. విద్యార్థుల చదువుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరిస్తున్నారు. భవిష్యత్తును బంగారం చేసుకోవాలని సూచిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 1584 ప్రభుత్వ పాఠశాలల్లో 94,725 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేయాల్సివుండగా శనివారం వరకు 78,559 మందికి పుస్తకాలను అందజేశారు. మిగిలిన 16,165 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సోమవారం అందజేస్తామని విద్యాశాఖాధికారులు తెలిపారు.

అభ్యసనకు ఉపయుక్తం



సెకెండ్ సెమిస్టర్ పుస్తకాలను సకాలంలో విద్యార్థులకు అందించడం వల్ల అభ్యసనకు ఉపయుక్తంగా ఉంటుంది. గతంలో పాఠ్యపుస్తకాల పంపిణీ ఆలస్యంగా జరిగేది. ప్రస్తుత ప్రభుత్వం ముందస్తుగానే పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేస్తున్నాం. సమష్టిగా విద్యాప్రణాళికలను అమలుచేస్తున్నాం.

– ఎస్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

నాడు

ప్రభుత్వ బడులన్నా, పేద కుటుంబాల పిల్లల చదువులన్నా చులకనభావం. మౌలిక సదుపాయాలను పక్కనపెడితే.. విద్యాభ్యాసనకు, బోధనకు ప్రధాన ఆధారమైన పుస్తకాలనూ సరిగా పంపిణీ చేయని దుస్థితి. పాఠశాలలకు అసలు పుస్తకాలు ఎప్పుడు వస్తాయో తెలియదు. సరైన ప్రణాళికా ఉండేది కాదు. పుస్తకాల కోసం ఉపాధ్యాయులు వాకబుచేస్తే ఉన్నత విద్యాశాఖాధికారుల నుంచి సమాధానం శూన్యం. పాత పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సేకరించుకోగలిగితే సరి.. లేదంటే చదువులు సాగని పరిస్థితి.

నేడు

పాఠశాలల పునఃప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక కింద విద్యాభ్యసన సామగ్రి పంపిణీ. నాడు–నేడు కింద పాఠశాలలకు ఆధునిక సొబగులు. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో ముద్రించిన పుస్తకాలను సెమిస్టర్ వారీగా సకాలంలో పంపిణీ. డిజిటల్ చదువుల దిశగా ట్యాబ్‌ల అందజేత. పేదకుటుంబాల పిల్లలు ఉజ్వల భవిష్యత్తుకు పాఠశాల స్థాయిలో గట్టి పునాది. ప్రభుత్వ లక్ష్యం మేరకు బోధన సాగిస్తున్న ఉపాధ్యాయ యంత్రాంగం.

మండలం	విద్యార్థుల సంఖ్య	పుస్తకాలు అందుకున్న వారి సంఖ్య
బలిజిపేట	3,585	2,733
భామిని	4,917	3,871
గుమ్మలక్ష్మీపురం	9,001	8,132
గరుగుబిల్లి	3,057	2,994
జియ్యమ్మవలస	4,269	3,397
కొమరాడ	5,724	5,012
కురుపాం	7,742	6,532
మక్కువ	4,968	3,978
పాచిపెంట	7,206	6,012
పాలకొండ	4,817	3,889
పార్వతీపురం	9,148	7,698
సాలూరు	10,984	8,436
సీతంపేట	10,306	9,422
సీతానగరం	3,557	2,850
వీరఘట్టం	4,543	3,712

శాఖల పనితీరుపైనే ప్రగతి సూచిక



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రభుత్వ శాఖల పనితీరుపైనే జిల్లా ప్రగతి ఆధారపడి ఉంటుందని కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. మహిళా శిశుసంక్షేమ శాఖపై ప్రాజెక్టు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో శనివారం సమీక్షించారు. వైఎస్సార్ సంపూర్ణపోషణ, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ, తక్కువ బరువు గల పిల్లల సంరక్షణ, నాడు–నేడు పనులు తదితర అంశాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరుసంఖ్య పెరగాలన్నారు. లబ్ధిదారుల హాజరు నమోదుశాతం 40–50 శాతానికి తగ్గడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. హాజరు నమోదుకు అంగన్‌వాడీ సిబ్బంది చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవన్నారు. జిల్లా నుంచి పంపిస్తున్న కనీస స్థాయి సూచిక నివేదికల ప్రభావం రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రగతిపై పడుతోందన్నారు. నాడు–నేడు పథకం కింద భవన నిర్మాణ పనులకు నిధులకొరత లేదన్నారు. పేరెంట్స్ కమిటీలతో సమన్వయం చేసుకొని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నివేదికలను మూడవపార్టీతో పరిశీలిస్తామని, తప్పుడు నివేదికలు పంపిణ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమ, మహిళ సాధికారత అధికారిణి కె.విజయగౌరి, జిల్లా పరిధిలోని సీడీపీఓలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు

ముందస్తు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

- జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో సివిల్ సప్లై అధికారులు, రైస్ మిల్లర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం తేమ శాతం తగ్గించేందుకు జిల్లాలో 95 రైస్ మిల్లుల్లో విధిగా డ్రైయర్స్ ఏర్పాటుచేయాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనెలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు రావల్సిన ట్రాన్స్‌పోర్టు చార్జీలు, లేబర్, గోనె సంచులు, ధాన్యం నగదును రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. ప్రతీ రైతు పంట వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేయించాలని, ఆర్‌బీకేలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ చేసిన తప్పిదాలవల్ల రైతులు నష్టపోతున్నారని, అలాంటి తప్పిదాలు పునరావృతం కాకూడదన్నారు. మిల్లర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు త్వరలో వచ్చేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ దేవ్ళ నాయక్, జిల్లా సివిల్ సప్లై అధికారి శివప్రసాద్, మిల్లర్ల ప్రతినిధులు రమేష్, శివ, అబ్బాయిబాబు పాల్గొన్నారు.

ఎల్.కోటలో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎల్.కోట మండలం రేగ గ్రామంలోని చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్

- 25న క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



విజయనగరం అర్బన్: జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంలో భాగంగా ఎల్.కోట మండలం రేగ గ్రామంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 25న ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటలకు తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తారు. రూ.4 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన యూనిట్ వల్ల 20 మందికి ఉపాధి కల్పనతోపాటు ఈ ప్రాంతంలో చిరుధాన్యాలు సాగుచేస్తున్న వెయ్యి మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద ఏర్పాటవుతున్న యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమం కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

చాగంటి తులసికి సాహిత్య పురస్కారం



సాహిత్య పురస్కారాన్ని చాగంటి తులసికి అందజేస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: బలివాడ కాంతారావు స్మారక జీవిత సాఫల్య సాహిత్య పురస్కారాన్ని రచయిత్రి చాగంటి తులసికి నిర్వాహకులు శనివారం ఆమె స్వగృహంలో అందజేశారు. భారత నిధి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డి.ఎస్.వి.గోపీకృష్ణ తన మామ, రచయిత బలివాడ కాంతారావు పేరిట పురస్కారంతో పాటు రూ.25వేలు నగదు, జ్ఞాపిక, దుశ్శాలువతో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు మేడ మస్తాన్‌రెడ్డి, ద్వారం దుర్గాప్రసాదరావు, డాక్టర్ డీవీజీ శంకరరావు, పప్పు భోగారావు, మంజరి, ఎన్.కె.బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫల ప్రదంగా ఉపాధి

- పండ్ల తోటల పెంపకానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తోడ్పాటు
- పార్వతీపురం మన్యం జిల్లాలో 5,500 ఎకరాల్లో సాగుకు సన్నాహాలు
- ఒక్కో ఎకరాకు రూ.96వేల వరకు ఉపాధిహామీ నిధులు
- సర్కారు ప్రోత్సాహంపై సాగుదారుల హర్షం



ఉపాధిహామీ పథకం కింద పండ్ల మొక్కల సాగును పరిశీలిస్తున్న డ్వామా అధికారులు

పాలకొండ రూరల్: ఆహార, వాణిజ్య, కూరగాయల పంటలతో పాటు పండ్లతోటల సాగును జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతులకు ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. వర్షాలు కురుస్తున్న వేళ పండ్ల మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చిన రైతులకు జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులను అందజేస్తోంది. చిన్న, సన్నకారు, బీసీ. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులకు 15 రకాల ఉద్యానవన పంటల సాగుకు ఊతమిస్తోంది. ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లాలో 5,500 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగుచేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంకాగా, జిల్లాలో 4,677 ఎకరాల్లో పండ్లతోటల సేద్యానికి 5,169 మంది రైతులు సిద్ధమయ్యారు. మామిడి, జీడి, జామ, కొబ్బరి, ఆయిల్ పాం, మునగ వంటి తోటల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. వీరికి డ్వామా, ఉద్యానవన శాఖ అధికారులు చేయూతనందిస్తున్నారు.

ఆర్థిక తోడ్పాటు ఇలా...

ఉపాధిహామీ పథకం కింద మూడేళ్లపాటు మొక్కల సంరక్షణకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది. మామిడి మొక్క కొనుగోలుకు రూ.45, జామ గ్రాఫ్టుకు రూ.30, జామ లేయర్‌కు రూ.20, నిమ్మకు రూ.25, కొబ్బరికి రూ.60 వంతున చెల్లిస్తోంది. ఆయిల్ పాం మొక్కలను ఉద్యానవన శాఖ ఉచితంగా సమకూర్చుతోంది. ఉద్యాన వన పంటలను సాగు చేసే రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు చేయించడంతో పాటు ఉపాధి వేతనదారులతో మొక్కలు వేసేందుకు గుంతలు తవ్విస్తుంది.

మామిడి తోటల్లో...

మామిడి మొక్కలు ఎకరాకు 70 నాటితే మూడేళ్లపాటు దుక్కి దున్నినందుకు ఒక్కో మొక్కకు రూ. 15.75, నీరు పోసినందుకు ఏడాదికి 24 తడుల వంతున మూడేళ్లకు 72 తడులకు ఒక్కో తడికి రూ5.45 వంతున, ఎరువులు, పురుగు మందుల పిచికారీకి ఒక్కో మొక్కకు రూ.25 చొప్పున ఉపాధిహామీ నిధులు అందజేస్తుంది. తోటల్లో కూరగాయలు, మినుములు, పెసర, వేరుశనగ వంటి అంతర పంటల సాగుకు ఏడాదికి రూ.వెయ్యి వంతున రెండేళ్లపాటు ఇస్తారు. తోటల సంరక్షణలో భాగంగా చుట్టూ కంచె వేసేందుకు ఎకరాకు రూ.3,213ను పనిదినాల రూపంలో చెల్లిస్తోంది. ఎకరం మామిడి తోట సాగు చేస్తున్న రైతుకు రూ.96వేల పైబడి ఆర్థిక తోడ్పాటు అందుతుంది.

రైతులకు ఎంతో మేలు



పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఉపాధిహామీ నిధులను అందజేస్తోంది. మొక్కలను ఉచితంగా ఇవ్వడంతో పాటు మూడేళ్లపాటు వాటి సంరక్షణకు నిధులు మంజూరు చేస్తోంది. మొక్కల సంరక్షణలో పాల్గొనే రైతులకు ఉపాధి హామీ వేతనదారుగా గుర్తించి వేతనం అందజేస్తోంది.

– కె.రామచంద్రరావు, డ్వామా పథక సంచాలకులు, పార్వతీపురం మన్యం

విరివిగా తోటల పెంపకం



జిల్లాలో తోటల పెంపకం విరివిగా సాగుతోంది. ప్రస్తుతం జిల్లాలో 70వేల ఎకరాల్లో జీడి, 15 వేల ఎకరాల్లో పామాయిల్, 10 వేల ఎకరాల్లో అరటి, 7వేల ఎకరాల్లో మామిడి, 4వేల ఎకరాల్లో పైనాపిల్, కూరగాయలు, ఇతర తోటలు 2వేల ఎకరాల్లో సాగులో ఉన్నాయి. వీటి విస్తీర్ణం మరింత పెంచడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. ప్రభుత్వ సహాయాన్ని రైతులు అందిపుచ్చుకోవాలి.

– కె.సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి, పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

బాలాజీ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం



ఎగిసి పడుతున్న అగ్ని కీలలు

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న బాలాజీ మార్కెట్‌లో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో షాపు నెంబర్ 216, 217లో పైన ఉన్న రెండు గదులలో ఉన్న దుస్తులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. మంటల తీవ్రత మరో రెండు షాపులకు విస్తరించింది. వ్యాపారస్తులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారమందించారు. రెండు వాహనాల్లో అగ్నిమాపక అధికారులు సంఘట నా స్థలానికి చే రుకుని రెండు గంటల పాటూ శ్రమించి మంటలను అదుపులో కి తీసుకువచ్చా రు. పరిసర ప్రాంతాల్లో ఉన్న షాపులన్నీ పూర్తిగా పొగమయయ్యాయి. సుమారు కోటి రూపాయల వరకూ ఆస్తి నష్టం వాటిల్లినట్టు నిర్వాహకు లు చెబుతున్నార ని ఏడీఎఫ్‌వో సోమేష్ తెలిపారు.

రైతుబజార్‌లో వైద్యశిబిరం



హోమియో మందు వేస్తున్న వైద్యుడు

విజయనగరం: నగరంలోని ఆర్అండ్‌బీ రైతుబజార్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా హోమియో వైద్యుడు గాడి ప్రసాద్ మాట్లాడుతూ, కండ్ల కలకల పట్ల ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. కలకలు అనేది కేవలం ఇన్‌ఫెక్షన్ మాత్రమేనని, అంధత్వానికి కారణం కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి సీహెచ్‌వీ సతీష్, సూపర్‌వైజర్ ఎం. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గొర్లిపేట జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గిరిబాల లబ్ధిదారులతో సమావేశమై నిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. నిర్మాణాలకు అవసరమైన వనరులను ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈ పవన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

విజయనగరం అర్బన్: జిల్లాలోని వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్‌చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. తొలుత పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, జిల్లాలో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, అటెండర్, వాచ్‌మెన్, ట్యూటర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్‌లో అదనంగా మరుగుదొడ్లు, స్నానాల గదులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. సునీల్, ఎస్.నాగభూషణం, సభ్యులు బి.రవికుమార్, ఎ.సుమన్, శ్రావణ్‌కుమార్, హరికృష్ణ, పోలినాయుడు, భానుప్రసాద్, రమేష్, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,160-00
బంగారం(22సి. 10గ్రా.)	55,150-00
వెండి (కిలో)	80,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

దీర్ఘాయుష్మాన్ భవ..!

- జిల్లా ఆస్పత్రిలోనే మెరుగైన వైద్యం
- జ్వరాల బారిన పడుతున్న వారికి తక్షణమే వైద్యం
- గతేడాది 288 మలేరియా, 13 డెంగీ కేసులు
- అవసరమైన వారికి అందుబాటులో రక్తం
- విశాఖకు పరుగెత్తాల్సిందే అంటూ పచ్చ మీడియా బురదజల్లే యత్నం

ఫ్యాక్ట్ చెక్



పార్వతీపురం జిల్లా ఆస్పత్రి

పార్వతీపురంటౌన్: విద్య, వైద్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఈ రెండింటి కోసం బడ్జెట్‌లో భారీగా కేటాయిస్తోంది. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను రూపురేఖలు మార్చిన ప్రభుత్వం ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడం కోసం ఇప్పటివరకు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సామాజిక ఆస్పత్రుల సేవలను పెంచుతూ వస్తోంది. ఇందులో భాగంగానే పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి స్థాయిని పెంచింది. గతంలో 100 పడకలున్న ఆస్పత్రి ప్రస్తుతం 150 పడకల ఆస్పత్రిగా మారింది. జిల్లా ఆస్పత్రిలో మెరుగైన సేవలు లభిస్తుండడంతో గిరిజనులకు ఈ ఆస్పత్రి ఆరోగ్య రక్షా కేంద్రంగా మారింది. గతంతో పోల్చుకుంటే విశాఖపట్నానికి రిఫర్‌చేసే కేసులు తగ్గుముఖం పట్టాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో జిల్లాలో జ్వరపీడితులు ఎక్కువవుతుండడంతో జిల్లా ఆస్పత్రిలోనే మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి సేవలపైన ప్రతిపక్షం బురదజల్లే ప్రయత్నంలో భాగంగానే ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన 'విశాఖకు పరిగెత్తాల్సిందే' కథనంపై వైద్యాధికారుల వివరణతో ''సాక్షి'' ఫ్యాక్ట్ చెక్ కథనం

గ్రామాల్లో విస్తృతంగా ఫీవర్ సర్వే

జిల్లాలో ఫీవర్ సర్వేలో 1553మంది ఆశావర్కర్‌లు, 364ఏఎన్‌ఎంలు నిమగ్నమయ్యారు. రోజూ 2600 మందిని సర్వే చేపిస్తున్నారు. జ్వరపీడితులకు సకాలంలో వైద్యం అందించడానికి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల రక్తపరీక్షలు అంటుబాటులో ఉన్నాయి. అలాగే వైద్యులు అంటుబాటులో ఉన్నారు. గ్రామాల్లో జ్వరాల కేసులు ఎక్కువగా నమోదువుతున్నట్లు సర్వేలో తేలితే వెంటనే ఆయా గ్రామాల్లో, ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సేవల్లో ముందంజలో జిల్లా ఆస్పత్రి

ఇదివరకే రాష్ట్రంలో అన్ని రకాల జిల్లా ఆస్పత్రుల తోపాటు ఏరియా ఆస్పత్రులను వైద్యశాఖ పరిశీలించింది. ఈ పరిశీలనలో పార్వతీపురంలోని జిల్లా ఆస్పత్రి జిల్లా ఆస్పత్రుల స్థాయిలో సేవలందిస్తున్నట్లు గుర్తించింది. ఆస్పత్రి సేవల్లో పార్వతీపురం జిల్లాలో గల మైదాన, గిరిజన గ్రామాల నుంచి వస్తున్న పేషెంట్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకోవడం కన్నా అన్ని వసతులతో కూడిన పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడం ఎంతో మేలని పేషెంట్లు చెబుతున్నారు.

పెరిగిన సేవలు

ఇక్కడ ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా ఏర్పాటు చేయడంతో పాటు సేవలు పెంచారు. ప్రతి రోజు సగటున 400మందికిపైగా ఓపీ నమోదవుతోంది. ఇందులో ప్రతి రోజు 270 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. అత్యవసర విభాగాల్లో అధునాతన వైద్య సామగ్రిని జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో ఉంచారు. సిటీస్కాన్, కోవిడ్ ల్యాబ్, జగనన్న ప్రాణవాయువు ప్లాంట్, డయాలసిస్ సెంటర్ వంటివి ఏర్పాటు చేశారు. ఈ విభాగాలకు సంబంధించి సంబంధిత స్పెషలిస్టులను భర్తీచేశారు.



గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిడ్నీ రోగులు

వైద్య సేవల్లో రాజీలేదు.



రోగులకు వైద్యసేవల్లో రాజీపడడం లేదు. సాధారణ జర్వంతో వచ్చిన వారందరికీ మలేరియా, టైఫాయిడ్, డెంగీ రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. పాజిటివ్ కేసులు నమోదైన వారందరికీ తక్షణమే చికిత్స అందిస్తున్నాం. జిల్లా ఆస్పత్రిలో గదులు అందుబాటులో ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఒకటి, రెండు కేసులు బయటకు రిఫర్ చేస్తున్నాం. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందిస్తున్నాం.

–డాక్టర్. బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం

పూలు కోస్తుండగా చైన్ స్నాచింగ్

పార్వతీపురం టౌన్ : పట్టణంలో చైన్ స్నాచింగ్ సంఘటన శనివారం వేకువ జాయున చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ దినకర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని రామానంద్ నగర్ కాలనీకి చెందిన దాసరి సత్యమణి వేకువజామున పూలు కోస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి తన మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్ లాక్కుని పారిపోయాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ చెప్పారు.

25 వరకు ధ్రువపత్రాల పరిశీలన

నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని వేణుగోపాలపురం డైట్ కళాశాలలో ఈ నెల 25 వరకు ధ్రువపతాలను పరిశీలించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 - 25 విద్యా సంవత్సరంలో డైట్‌లో చేరబోయే విద్యార్థులు గమనించాలని సూచించారు. వేణుగోపాలపురం డైట్‌తో పాటు ప్రగతి డీఈడీ కళాశాలల్లో సీట్లు పొంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 26 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో ఆదాయం

డెంకాడ: పెరటికోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం చేకూరుతుందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండలంలోని జొన్నాడలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీ రాజ్‌కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు శనివారం కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, సర్పంచ్ కోరాడ రమణి, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ కోటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు..

- పనులు చేసిన వెంటనే బిల్లుల చెల్లింపు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు
- విజయనగరం నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష



విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ముత్యాలనాయుడు

విజయనగరం అర్బన్: నిధులకు కొరత లేదని, అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి విజయనరం నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై శనివారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, గృహనిర్మాణం, టిడ్కో, ఉపాధిహామీ, పంచాయతీ, విద్య, వైద్యం, నీటిపారుదల, విద్యుత్, మహిళా శిశు సంక్షేమం, తదితర శాఖల వారీగా సమీక్షించారు. ఆయా శాఖల అధికారులు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకుని నాలుగేళ్లుగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పట్టణంలోని రహదారులను విస్తరించి, అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అంబటి సత్రం జంక్షన్, కొత్తపేట అంతర్ జిల్లా ఆర్అండ్‌బీ రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. పెద్దచెరువులో పూడికలు తొలగించేందుకు సుమారు రూ.2 కోట్లు అవసరమని తెలిపారు. ముషిడిపల్లి పైప్‌లైన్‌ను రూ.53 కోట్లతో మార్చాల్సి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో జల్‌జీవన్ మిషన్ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందుకే నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సూచించారు. డిప్యూటీ స్పీకర్ కోరిక మేరకు విజయనగరం మండలంలో అదనంగా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, పట్టణంలోని గాజులరేగలో రైతుభరోసా కేంద్రం మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం చక్కని కార్యక్రమమని.. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం వల్ల స్థానిక సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని, ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జల్‌జీవన్ మిషన్ పనులను ప్యాకేజీ రూపంలోనే కాకుండా అవసరమైతే విడివిడిగా టెండర్లు పిలిచి, పనులను యుద్ధప్రాతిపతిపదికన పూర్తి చేయాలని అదేశించారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కె..మయూర్‌అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, సీపీఓ బాలాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు పరామర్శ

విజయనగరం: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును పలువురు ప్రజాప్రతినిధులు శనివారం పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ తండ్రి మజ్జి నర్సింగరావు ఇటీవల మరణించడంతో ఎంపీ బెల్లాన సుధాకర్, ఎమ్మెల్యే కంబాల జోగులు,ఎమ్మెల్సీలు పెను మత్స సురేష్‌బాబు, వేపాడ చిరంజీవిరావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సు ధాకర్, మాజీ ఎమ్మెల్యే శోభా హైమా వతి ప్రదీప్‌నగర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించి తమ సానుభూతి తెలిపారు. జిల్లా యాదవ సంఘం సభ్యులు పడగల బంగార్రాజు ఆధ్వర్యంలో జిల్లా తప్పెటగుళ్ల కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సరాబోని శంకరరావు తన కళాకారుల బృందంతో కలిసి వచ్చి నర్సింగరావు మృతి పట్ల సంతాపం తెలిపారు.



జెడ్పీ చైర్మన్ తండ్రి నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్

భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి



పీహెచ్‌సీ వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

కొత్తవలస : మండల కేంద్రంలోని భారత్ డిఫెన్స్ అకాడమి సమీపంలో గల ఒక భవనం మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బస్సు బహదూర్‌సింగ్(29) శనివారం మృతి చెందాడు. ఎస్ఐ వీరజనార్దన్ తెలిపిన వివరాలు.. కంటకాపల్లి నుంచి కొర్లాం మధ్యలో జరుగుతున్న జాతీయ రహదారి పనులకు మధ్యప్రదేశ్ నుంచి కొందరు కార్మికులు ఇక్కడకు వచ్చారు. కొత్తవలస మండల కేంద్రంలోని భారత్ డిఫెన్స్ అకాడమి సమీపంలోని ఒక భవనంలో అద్దెకు ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం మృతుడు మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గ్రౌండ్ ఫ్లోర్‌లో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన బహదూర్‌సింగ్‌ను స్థానిక పీహెచ్‌సీకి తోటి కార్మికుల సాయంతో తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. హైవే రోడ్డు నిర్మాణ పనుల సూపర్‌వైజర్ బి.అవతారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరజనార్దన్ తెలిపారు. మృతుడికి భార్య, ఐదేళ్ల బాబు ఉన్నారు.

ఇన్‌చార్జ్ మంత్రిని కలిసిన ప్రజాప్రతినిధులు



ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తోన్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గాల సమీక్ష సమావేశాల్లో భాగంగా శనివారం జిల్లాకు వచ్చిన ఆయన విజయనగర నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆహ్వానం మేరకు ఆయన నివాశానికి వెళ్లారు. ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు కోలగట్ల నివాసానికి వెళ్లి బూడి ముత్యాలనాయుడును కలిసి సత్కరించారు. అనంతరం విజయనగరం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను ఇన్‌చార్జ్ మంత్రికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పరిచయం చేశారు.

సీజనల్ వ్యాధుల వివరాలు తెలియజేయండి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: సీజనల్ వ్యాధుల వివరాలను తెలియజేయాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు తెలిపారు. పట్టణంలోని ఎస్‌వీ, ఎస్ఎస్, ఎంఎస్ ఆస్పత్రులతో పాటు చిత్ర స్కాన్ సెంటర్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం స్కానింగ్‌లు తీయాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



చిత్ర స్కానింగ్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం హెచ్‌ఓ భాస్కరరావు

రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులు

- శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



బూడివీధిలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని 12వ డివిజన్ బూడి వీధి పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శనివారం శంకుస్థాపనలు చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఎమ్మెల్యేను, తదితరులకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రూ. 20 లక్షలతో చేపట్టనున్న రహదారులు, కాలువల పనులను కోలగట్ల శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ రేగాన రూపాదేవి మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఇప్పటివరకు రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో జరిగాయన్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలలో కూడా అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయని చెప్పారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ పనిచేస్తున్నాయన్నారు. పైడితల్లమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ వెత్సా శ్రీనివాసరావు మాట్లాడుతూ, సమస్యలు తెలియజేసిన వెంటనే డిప్యూటీ స్పీకర్ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరంలో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, జోనల్ ఇన్‌చార్జ్ ముచ్చు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొంగ భానుమూర్తి, డొంకాడ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.